సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 9 । జూలై । 2025



## సంక్షోభంలో సంక్షేమం

సంక్షేమ హాస్టళ్లలో సంక్షోభం నెలకొంది. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. - 8లో



## దారుణదారులు

ఎచ్చెర్ల మండలం వెంకటాపురం దారులు దారుణంగా మారాయి. ప్రయాణికులకు యాతన తప్పడం లేదు. - 8లో

## నేడు రైల్వే గేటు మూసివేత

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల రైల్వే గేటును బుధవారం రాత్రి మూసివేస్తున్నట్లు రైల్వే ఎస్ఎస్ఈ ఆర్.జి.శర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సిగ్నల్ కేబుల్ వర్క్ చేపడుతున్న దృష్ట్యా రాత్రి 10 గంటల నుంచి గురువారం వేకువజామున 4 గంటలకు గేటును మూసివేస్తున్నట్లు వెల్లడించారు. రాకపోకల అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## న్యూస్‌రీల్

### ఆమదాలవలస మండలానికి చేరిన కిట్లు

శ్రీకాకుళం: ఆమదాలవలస మండలంలోని పాఠశాలలకు మంగళవారం కిట్లు, యూనిఫారాలు సరఫరా అయ్యాయి. 'రాష్ట్ర అధికారులకు సమాచారం ఇవ్వరా..?' పేరిట 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం జిల్లాకు వచ్చిన యూనిఫారాల కిట్లను ఆమదాలవలస మండలానికి పంపించారు. అయితే మెగా టీచర్ పేరెంట్స్ మీటింగ్ డే నాటికి వీటిని కుట్టడం కుదరదని టీచర్లు తేల్చి చెప్పేశారు. ఇంకా ఐదు మండలాలకు కిట్లు, యూనిఫారాలు రావాల్సి ఉండడంతో ఏపీసీకి ఆ బాధ్యతలను అప్పగించారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో అదనంగా ఉన్న కిట్లు, యూనిఫారాలు సేకరించి సరఫరా కాని మండలాలకు పంపించాలని ఆదేశించారు.

### విద్యాసంస్థల వద్ద నిషేధిత ఉత్పత్తులు అమ్మితే చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : విద్యాసంస్థల పరిసరాల్లో నిషేధిత గంజాయి, పొగాకు ఉత్పత్తులు క్రయవిక్రయాల జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా డీజీపీ హరీష్‌గుప్తా ఆదేశాల మేరకు ఎస్పీ మంగళవారం ప్రకటన జారీ చేశారు. దీనిలో భాగంగా ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లు పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఈగల్ టీం, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంతో పాఠశాలలు, కళాశాలలకు వందమీటర్ల దూరంలో ఉన్న పాన్ కిరాణా దుకాణాల్లో సిగరెట్లు, ఖైనీ, గుట్కా, గంజాయి తదితర ఉత్పత్తులు అమ్మరాదని, ఐదురోజుల పాటు డ్రైవ్‌లో భాగంగా పోలీసుల తనిఖీలు ఉంటాయన్నారు. మొదటి దశలో తనిఖీల్లో దొరికితే జరిమానాలుంటాయని, తర్వాత దశలో కేసులు కడతామన్నారు.

### కనీసం ఐదు ఇళ్లకు వెళ్లండి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఈ నెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బుధవారం ఉదయం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కనీసం ఐదు ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఈ సభకు ఆహ్వానం పలకాలని అధికారులకు ఆయన పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. ఇదే సమయంలో జిల్లా పర్యటనలో ఉన్న కలెక్టర్ కారులో నుంచి వీసీలో మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌పై ఆశయాలను ఒక పేరాలో రాసి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ప్రతి బుధవారం నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పేరుతో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధి హామీ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, కంపోస్ట్ గుంతలు, నీటిని చేర్చే గుంతల పనులను వేగంగా పూర్తిచేయాలని సూచించారు.

### విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు



కిల్లిపాలెంలో ఆర్‌డీఎస్ఎస్ పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్ వనజ, పక్కనే ఎస్ఈ కృష్ణమూర్తి

అరసవల్లి: జిల్లాలో అన్ని ప్రాంతాల్లోనూ అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టాలని ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టి.వనజ అధికారులను ఆదేశించారు. ఈమేరకు జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆమె జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పనులను పరిశీలించారు. అంతకుముందు పలు విద్యుత్ అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతాపరంగా పలు సూచనలు చేశారు. జిల్లాలో పనుల ప్రగతిని జిల్లా సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆమెకు వివరించారు. అంతకుముందు ఆమె జిల్లా విద్యుత్ స్టోర్స్‌ను పరిశీలించారు. అలాగే కిల్లిపాలెంలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. చిలకపాలెంలోని రెండు 33 కేవీ ఫీడర్లను పరిశీలించి మెరుగైన చర్యలకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీజీ ఎం ప్రసాద్, ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు, టెక్నికల్ ఈఈ సురేష్‌కుమార్, డిప్యూటీ ఈఈ వెంకటేశ్వరరావు, స్టోర్స్ ఏడీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.




ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, తదితరులు




వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్




పలాస కిడ్నీ ఆస్పత్రి ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు, నాయకులు




వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం




వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్




ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




పార్టీ రాష్ట్ర కళింగ కుల విభాగ అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు ఆధ్వర్యంలో..




పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, దువ్వాడ వాణి తదితరులు




వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

శ్రీకాకుళం

రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు. చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



## మహానేత మనసాస్మరామి

మహానేత మనసాస్మరామి అంటూ రాజన్నను వైఎస్సార్ సీపీ నాయకులు స్మరించుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్షేమ రథసారథి సేవలను గుర్తు చేసుకుని ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేస్తా మని అన్నారు. ఎక్కడికక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.





బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

## భారీగా బంగారు ఆభరణాల పట్టివేత

రణస్థలం: పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన తనిఖీల్లో సుమారు 5.2 కిలోల బంగారు ఆభరణాలు, రూ.6.40 లక్షల నగదును జేఆర్ పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళుతున్న కారును తనిఖీ చేయగా అందులో బంగారు ఆభరణాలు, నగదు లభించింది. కారులో ఉన్న ముగ్గురు మార్కెటింగ్ వ్యక్తులు కె.శ్రీనివాసరావు, అమర రాజయ్య, కె.సూర్యలను అదుపులోకి తీసుకున్నారు. వీరు విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వచ్చి పలు బంగారం దుకాణాలకు ఆభరణాలు విక్రయించి తిరిగి మిగిలిన బంగారం తీసుకుని వెళుతుండగా పట్టుకున్నారు. ఆభరణాలకు పత్రాలు ఉన్నా జీఎస్టీ నమోదు పత్రాలు లేకపోవడంతో జిల్లా జీఎస్టీ అధికారులకు అప్పగించారు. వాళ్లు పూర్తి స్థాయిలో లెక్కించి అపరాధ రుసుం విధిస్తారని తెలిపారు.

## విధులు చెబుతారు..

# నిధులు ఇవ్వరు




- మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ కోసం ప్రభుత్వం హడావుడి
- వారం రోజులుగా బోధనకు దూరంగా టీచర్లు
- ప్రభుత్వ నిర్వాకంతో చేతి చమురు వదిలించుకుంటున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు
- ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కార్యక్రమానికి రూ. లక్ష వరకు ఖర్చు
- రికార్డుల కోసం పాకులాట

శ్రీకాకుళం న్యూకాలనీ:

సర్కారు రికార్డుల పిచ్చి టీచర్లకు తలనొప్పిగా మారింది. కనీస నిధులు ఇవ్వకుండా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రస్తుతం మెగా పేరెంట్–టీచర్స్ మీటింగ్(పీటీఎం) పేరిట కూటమి ప్రభుత్వం చేస్తున్న హడావుడి సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. గిన్నిస్‌బుక్‌లో రికార్డుల కోసం అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులను నానా అవస్థలకు గురి చేస్తున్నారు.

**3182 విద్యాసంస్థల్లో పేరెంట్స్ మీట్..**

జిల్లాలో మొత్తం 3017 పాఠశాలు ఉండగా, వీటిలో ప్రైవేటు పాఠశాలలు 389 ఉన్నాయి. అలాగే మొత్తం 165 జూనియర్ కళాశాలు ఉండగా, వీటిలో ప్రైవేటు కళాశాలలు 71 ఉన్నాయి. ఒకటి నుంచి ఇంటర్ వరకు 3.04లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. పీటీఎం కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను పిలిచి విద్యార్థుల ప్రగతిని వివరించడం.. వారికి అక్కడే మధ్యాహ్న భోజనం, క్రీడల నిర్వహణ, సమావేశం, అతిథులు ప్రసంగాలు.. ఇలా ఉదయం 9 గంటల నుంచే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. ఇందుకోసం పాఠశాలల్లో 17 రకాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు కొన్ని కుదించారు. ఆహ్వాన పత్రికలు, వేదికల ఏర్పాట్లు, బహుమతుల ప్రదానం, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించడం.. ఇలా వివిధ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు రావడంతో ఆ బాధ్యతంతా ఉపాధ్యాయులపైనే పడుతోంది.




విద్యాశాఖ జారీచేసిన పేరెంట్–టీచర్స్ మీటింగ్ మోడల్ ఫ్లెక్స్

**బోధనకు దూరంగా టీచర్లు..**

నిన్న యోగాంధ్ర.. నేడు పేరెంట్స్ మీట్ అంటూ టీచర్లను సమావేశాలకు, సన్నాహాలకు పరిమితం చేస్తుండడంతో వారు బోధనకు దూరమవుతున్నారు. తాజాగా రెండు వారాల నుంచి తల్లిదండ్రుల సమావేశమంటూ నానా హంగామా చేస్తున్నారు. హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డుల పేరిట చాంతడంత డేటాను పూరిస్తున్నారు. దీంతో విద్యాబోధన రెండు అడుగులు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంలా తయారైంది. దీనికి తోడు తమ ప్రచార యావ, రికార్డుల కోసం ఉపాధి హామీ పథకం వేతనదారులను వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థులకు సంరక్షకులుగా వారిని వినియోగించుకుని ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం.

**అంతా 'లీప్' యాప్‌లోనే..**

తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా సమావేశం జరిగిన వెంటనే 30 సెకన్ల వీడియో, మూడు ఫొటోలను లీప్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి.

విద్యార్థులతో మొక్కలు నాటించడం.. దాన్ని లీప్ యాప్‌లో నమోదు చేయించడం, ప్రతి మూడు నెలలకు ఆ మొక్క ఫొటోలను అప్‌లోడ్ చేయించడం ఇదంతా ఉపాధ్యాయుల పనే. దీనిపై టీచర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**తమ పనితీరుకు 'సాక్ష్యం'పై గుర్రు..**

పేరెంట్ టీచర్స్ సమావేశాల పర్యవేక్షణకు ఒక్కో పాఠశాల, కళాశాలలకు ఇతర శాఖల నుంచి ఒక ఉద్యోగిని కేటాయించారు. వీరు కార్యక్రమ నిర్వహణకు సాక్షిగా ఉంటారని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో, స్థానికంగా ఉండే ఉద్యోగులు(ఐడీ నంబర్‌తో), పెద్దలను(ఆధార్ నంబర్‌తో) నియమించుకోవచ్చని సర్దుబాటు ఉత్తర్వులు ఇచ్చింది.

**చేతిచమురు వదులుతోంది..**

అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, వీఐపీలు, అతిథులు, పూర్వపు విద్యార్థులు, దాతలు ఇలా అనేక మందిని పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు ఆహ్వానిస్తున్నారు. వీరిందరికీ భోజనాలు, స్నాక్స్ తో పాటు ఇతరత్రా ఏర్పాట్లకు కనీసం రూ.70వేల నుంచి లక్ష వరకు ఖర్చు అవుతున్నట్టు ప్రచారం సాగుతోంది. పాఠశాల గ్రాంట్ కింద కనీస నిధు లు విదల్చకుండా అందులో 20 శాతం వాడుకోండని ఆదేశాలివ్వడంపై హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు మండిపడుతున్నారు. స్థానికంగా ఉండే టీచర్లు, లెక్చరర్లు గత్యంతరం వారే తలా కొంత డబ్బులు వేసుకుని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**పరీక్షలు లేని ప్రోగ్రెస్ కార్డులు ఎందుకు..?**



ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి పరీక్షలు జరగలేదు. ఇప్పుడు ప్రొగ్రెస్ కార్డులు ఎందుకో అర్థం కావడం లేదు. ఊరికే సమావేశం తప్ప ప్రయోజనం లేదు.

– తమ్మినేని చందనరావు, ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**రికార్డుల కోసం మీటింగులు తగదు..**



గిన్నిస్‌బుక్‌లో రికార్డుల కోసం రాష్ట్రప్రభుత్వం పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0 ను నిర్వహిస్తుండటం బాధాకరం. పూర్తిస్థాయిలో నిధులు కేటాయింపు చేయలేదు. టీచర్లే తలా చేయి వేసి నిర్వహిస్తున్నారు.

– బి.వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్(1938) జిల్లా ప్రధాన కార్యదర్శి

## పోలీసు స్టేషన్‌కు ఐరన్ లాకర్

- చోరీ కేసుతో సంబంధం ఉన్నట్లు గుర్తింపు

నరసన్నపేట/జలుమూరు: వంశధార నదిలో నరసన్నపేట మండలం చోడవరం గ్రామానికి చెందిన ఇద్దరు జాలర్లకు ఇటీవల దొరికిన ఐరన్ లాకర్ కథ ఎట్టకేలకు జలుమూరు పోలీసు స్టేషన్‌కు చేరింది. ఈ లాకర్ వ్యవహారంపై శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం చేరడంతో వారు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. నరసన్నపేట మండలం చోడవరం గ్రామానికి చెందిన ఇద్దరు జాలర్లు శైలాడ బుచ్చయ్య, మద్ది రామకృష్ణలు 15 రోజుల క్రితం వంశధారలో చేపల వేటకు వెళ్లగా వారికి ఒక ఐరన్ లాకర్ దొరికింది. లాకర్ బురద పట్టి ఉండడంతో వీరు తెరవలేక గారకు చెందిన ఒక పాత ఇనుప సామాన్ల వ్యాపారికి రూ.2 వేలకు విక్రయించారు. ఆయన లాకర్‌ను తెరిపించి చూడగా వెండి వస్తువులు, బురద పట్టిన కొంత డబ్బు బయట పడ్డాయి. ఈ సమాచారం రెవెన్యూ యంత్రాంగం దృష్టికి వెళ్లినా వారు పట్టించుకోలేదు. కొద్ది రోజులకు పోలీసులకు విషయం తెలిసింది. దీంతో శ్రీకాకుళం టాస్క్‌ఫోర్సు పోలీసులు దీనిపై దృష్టి సారించి కూపీ లాగారు.

**చోరీకి గురైన లాకర్‌తో సంబంధం**

జలుమూరు మండలం సురవరం గ్రామానికి చెందిన సురవరపు శివప్రసాద్ ఇంట్లో చోరీకి గురైన ఐరన్ లాకర్‌కు దీనికి సంబంధం ఉన్నట్లు గుర్తించారు. 2024 జులై 21వ తేదీన తమ ఇంట్లో చోరీ జరిగినట్లు శివప్రసాద్ అప్పట్లో జలుమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఇద్దరు జాలర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించి, వారి ద్వారా ఐరన్ లాకర్, దాంట్లో ఉన్న వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. సుమారు రెండు కేజీల వెండి వస్తువులు, రెండు లక్షల డబ్బు ఉన్నట్లు సమాచారం. దీనిపై నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా చోడవరంలో దొరికిన ఐరన్ లాకరుకు, సురవరపు జగదీశ్వరరావు ఇంట్లో చోరీకి గురైన లాకరుకు సంబంధం ఉందన్నారు. అయితే జాలర్లు నిందితులు కాదని, అందువల్ల వారిని విడిచి పెట్టామన్నారు. ఈ కేసు తదుపరి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



జాలర్లకు దొరికిన ఐరన్ లాకర్

## సమస్యలు తీర్చే వరకు గ్రామాన్ని వీడేది లేదు

- ఆర్డీవోకు తేల్చి చెప్పిన మూలపేట గ్రామస్తులు



ఆర్డీఓకు తమ సమస్యలను వివరిస్తున్న మూలపేట గ్రామస్తులు

సంతబొమ్మాళి: తమ సమస్యలు తీర్చే వరకు గ్రామాన్ని విడిచివెళ్లే ప్రసక్తి లేదని మూలపేట గ్రామస్తులు టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తికి తేల్చి చెప్పారు. పోర్టు పునరావాస గ్రామమైన మూలపేట గ్రామస్తులతో మంగళవారం ఆర్డీఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నిర్వాసితులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ముందుగా భూములు ఇచ్చిన వారికి ఎకరాకు రూ.25లక్షలు చెల్లించారని, భూములు ఇవ్వనివారికి రూ. 25 లక్షలతో పాటు ఎకరాకు అదనంగా రూ. 12,50,000 లు చెల్లించారని, అందరికీ సమన్యాయం చేయాలని కోరారు. తమ గ్రామంలో కనీసం ఉపాధి పనులు కూడా కల్పించ డం లేదని వాపోయారు. పోర్టు యాజమాన్యం నిర్మించిన బ్రిడ్జిని వారే తొలగించారని, నౌపడ వెళ్లే రహదారిలో ఉన్న పాత బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పదిమందికి పైగా గర్భిణులు ఉన్నారని, వైద్యం కోసం బయటకు వెళ్లాలంటే రహదారి అధ్వానంగా ఉందని తెలిపారు. సమావేశం అనంతరం ఆర్డీవో గ్రామంలో ఇంటింటా తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో తహసీల్దార్ హేమచంద్రరావు, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, టెక్కలి సీఐ శ్రీనివాసరావు, నౌపడ, సంతబొమ్మాళి ఎస్ఐలు నారాయణస్వామి, సింహాచలం వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## నింగికి నేలకు నిచ్చెనలా..



ఇచ్ఛాపురంలో మంగళవారం ఉదయం ఏర్పడిన హరివిల్లు ఆకట్టుకుంది. మైదానంలో వ్యాయామం చేసేందుకు వచ్చిన వారు హరివిల్లును చూసి అబ్బురపడ్డారు. - ఇచ్ఛాపురం

## క్లుప్తంగా

### పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



అల్లెన పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో తిరుమల చైతన్య

బూర్జ: మండలంలోని పాలవలస జెడ్పీహెచ్ స్కూల్, అల్లెన ప్రాథమికోన్నత పాఠశాలల్లో డీఈవో డాక్టర్ తిరుమల చైతన్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా పాలవలస జెడ్పీ హైస్కూల్ పరిశీలించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరుపై ఎంఈవోలు ఎస్.శ్యామసుందర రావు, బి.ధనుంజయరావులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యాబోధన ఏవిధంగా ఉందో విద్యార్థులకు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అల్లెన పాఠశాలలో విద్యార్థులు పాలవలస పాఠశాలలో మెర్జి చేయడంతో తల్లిదండ్రులు పంపించే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. అయితే 100 మంది విద్యార్థులు ఉంటే గానీ యూపీ స్కూల్ కొనసాగించలేమని డీఈవో పేర్కొన్నారు. ఆయనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### హోంగార్డు కుటుంబానికి చేయూత



హోంగార్డు జగన్నాథంకు చెక్ అందజేస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు పి.జగన్నాథంకు జిల్లా హోంగార్డుల యూనిట్ ఒక్కరోజు వేతనం రూ.4.09 లక్షలను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి చేతులమీదుగా అందజేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జగన్నాథంకు చెక్ అందించారు.

### మా భూములు తీసుకోవద్దు

నరసన్నపేట: ఎంఎస్ఎంఈవో పార్కు నిమిత్తం తమ భూములు తీసుకోవడానికి ప్రభుత్వం చూస్తోందని, తమ భూములు తీసుకోవద్దని మండలంలోని జమ్ము గ్రామానికి చెందిన ఎస్సీ రైతులు బమ్మిడి రామారావు, తలసముద్రం రాజారావు, తాడి మొఖలింగంలతో పాటు పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 40 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం తమ జీవనాధారానికి భూములను ఇచ్చిందని, ఇప్పుడు ఇండస్ట్రియల్ పార్కు పేరిట తాము సాగు చేసి పంటలు పండించుకుంటున్న భూములు తీసుకోవడానికి అధికారులు చూస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ఇది ఏమాత్రం తగదని పేర్కొన్నారు. ఆర్ఐ సాయిరాంతో పాటు వీఆర్వో, సర్వేయర్లు వచ్చి సోమవారం కొలతలు వేశారన్నారు. తమ భూముల వైపు అధికారులు రావద్దని కోరారు.

### 'ముప్పై ఏళ్లు టీడీపీలో కష్టపడ్డా.. గుర్తింపేదీ..?'



విలేకరుల సమావేశంలో ముక్కు ఆదినారాయణ

రణస్థలం: తాను ముప్పై ఏళ్లు టీడీపీలో కష్టపడ్డానని అయినా గుర్తింపు ఇవ్వలేదని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముక్కు ఆదినారాయణ అన్నారు. మండలంలోని రావాడ పంచాయతీలో తన ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేశానని, ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేశానని చెప్పారు. ఎచ్చెర్ల నియోజకవర్గ మార్కెట్ చైర్మెన్ ఎస్సీ రిజర్వేషన్ అయిందని, అన్ని అర్హతలుండి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే తనను నామినేట్ చేయకుండా వేరేవాళ్లకు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. దీనికి నిరసనగా తాను పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తానని, అలాగే టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటానని తెలిపారు.

### విజిలెన్స్ దాడులు



తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

రణస్థలం: మండల కేంద్రంలోని రామతీర్థాలు రహదారిలో జే.ఆర్.పురంలో ఉన్న ఎరువుల దుకాణంపై విజిలెన్స్, వ్యవసాయ అధికారులు మంగళవారం దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా స్టాక్ రిజిస్టర్‌తో ఎరువుల భౌతిక నిల్వలను పోల్చితే వ్యత్యాసాలు కనిపించాయి. అలాగే అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నట్లు గుర్తించారు. దీంతో ఎరువులను స్వాధీనం చేసుకొని, దుకాణం డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కానిస్టేబుల్ ఈశ్వర్, మండల వ్యవసాయ ఏవో డి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సం క్షోభంలో క్షేమం..!

- ఏడాదిగా వసతి గృహాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- అరకొర వసతులతో కాలం వెళ్లదీత
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- పట్టించుకోని అధికారులు



శ్రీకాకుళం బాలుర ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు భోజనం పెడుతున్న దృశ్యం (ఫైల్)

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని వసతి గృహాలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఏడాదిగా సంక్షేమ శాఖ వసతి గృహాలు, అక్కడ చదువుతున్న విద్యార్థులను పట్టించుకోవడం లేదు. దీంతో సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. జిల్లాలో బీసీ వసతి గృహాలు ప్రీ మెట్రిక్ స్థాయిలో 63 ఉన్నాయి. వీటిలో వసతులు లేవు. కొన్ని అద్దె భవనాల్లో ఉండగా, వాటి పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఇక ఎస్సీ వసతి గృహాలు ప్రీ మెట్రిక్‌లో సుమారుగా అన్ని ప్రభుత్వ భవనాలే అయినప్పటికీ, అక్కడ కూడా అరకొర వసతులతోనే కాలం గడుపుతున్నారు.

### మెనూ అమలు ఎక్కడ..?

సంక్షేమ వసతి గృహ అధికారులు విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ అమలు చేయడం లేదు. దీనిపై కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తే వారికి అడ్డగోలు సమాధానాలు చెబుతున్నారు. ప్రభుత్వం నిధులు సకాలంలో మంజూరు చేయడం లేదని చెప్పడం, లేకుంటే ఎదుదాడికి దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికీ రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మెనూ అమలులో ఉంది. ప్రతి ఏటా మారుతున్న మెనూ అమలు చేయాల్సి ఉన్నా, ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మరోవైపు ఇటీవల పురుగులు పట్టిన బియ్యం అందజేస్తుండడంతో వసతి గృహం పేరు చెబితేనే విద్యార్థులు భయపడుతున్నారు.

### కొరవడిన పర్యవేక్షణ

సంక్షేమ వసతి గృహాధికారులు ఎక్కడా అందుబాటులో నివాసం ఉండే పరిస్థితి లేదు. ఒకొక్క వార్డెన్‌కి రెండు, మూడు వసతి గృహాల ఇన్‌చార్జిల బాధ్యతలు ఉంటున్నాయి. ఇవి కూడా కనీసం 30 కిలోమీటర్ల దూరంలో ఇస్తున్నారు. సాధారణంగా ఇన్‌చార్జిగా దగ్గరలో ఉన్న వసతి వార్డెన్‌కు బాధ్యతలు ఇవ్వాల్సి ఉన్నా, ప్రస్తుతం బీసీ సంక్షేమంలో ఇందుకు భిన్నంగా ఉంది. దూరప్రాంతాల్లో ఉన్నవారికి బాధ్యతలు ఇస్తున్నారు. దీంతో వసతి గృహ నిర్వహణ కిందిస్థాయి సిబ్బంది, అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై విడిచి పెడుతున్నారు. మరోవైపు ఏడాదిగా వసతి గృహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. అధికారులు కార్యాలయానికే పరిమితం కావడం, వ్యక్తిగత లాభాపేక్ష చూసుకుంటుండడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. అలాగే వైఎస్సార్‌సీపీ హయాంలో వసతి గృహాల ఆధునికీకరణ పనులు చేపట్టి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు కృషి చేయగా, నేడు భవనాలకు పడుతున్న బూజును కూడా శుభ్రం చేయడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

### తగ్గుతున్న విద్యార్థులు

బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది ఘననీయంగా తగ్గింది. వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీ మెట్రిక్ పరిధిలో జిల్లాలో 53 బాలురు, 10 బాలికల బీసీ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 2024–25 విద్యా సంవత్సరంలో బాలురు 4,019 మంది, బాలికలు 1,070 మంది కలిపి మొత్తం 5,086 మంది ఉండేవారు. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో బాలురు 3,269 మంది, బాలికలు 894 మంది కలిపి మొత్తం 4,163 మంది ఉన్నారు. అంటే ఒక ఏడాది కాలంలో 923 మంది విద్యార్థులు తగ్గిపోయారు. అదేవిధంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 17 బాలురు, 14 బాలికల ఎస్సీ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 2024–25 విద్యా సంవత్సరంలో బాలురు 1,352 మంది, బాలికలు1,438 మంది కలిపి మొత్తం 2,790 మంది విద్యార్థులు ఉండేవారు. కాగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో బాలురు 1,122 మంది, బాలికలు 1,110 మంది కలిపి మొత్తం 2,232 మంది ఉన్నారు. అంటే ఒక ఏడాది కాలంలో 558 మంది తగ్గారు.

# కంచిలిలో భారీ చోరీ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

- 24.5 తులాల బంగారు ఆభరణాలు, ఒక కిలో వెండి మాయం
- ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో భారీ చోరీ జరిగింది. మెయిన్‌రోడ్డులో నివాసముంటున్న విశ్రాంత లెక్చరర్ సింహాద్రి ప్రధాన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. బీరువాలో భద్రపరిచిన 24.5 తులాల బంగారు ఆభరణాలు, ఒక కిలో వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడు చెప్పిన వివరాల మేరకు.. తమ పెద్ద కుమారుడు జర్మనీ నుంచి ఇండియాకు వచ్చి, విశాఖపట్నంలో తమ వియ్యంకుడు ఇంట్లో ఉండడంతో వారిని కలవడానికి శనివారం ఉదయం భార్యతో కలిసి వెళ్లారు. తిరిగి ఆదివారం సాయంత్రం కంచిలిలో తన నివాసానికి చేరుకున్నారు. వారు ఇంటికి వచ్చేసరికి మెయిన్ డోర్‌తో పాటు ముందున్న గ్రిల్ తెరిచి ఉన్నాయి. ఇనుప గ్రిల్ డోర్‌కు తాళం వేసి ఉన్న భాగాన్ని కట్‌చేసి, మెయిన్‌డోర్ లాక్‌ను తెరిచి దుండగులు లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు.



బాధితుడు సింహాద్రి ప్రధాన్

ఇంట్లోని బీరువాలో భద్రపరిచిన 24.5 తులాల బంగారు ఆభరణాలను, ఒక కిలో వెండి ఆభరణాలను దొంగిలించినట్లు తెలుసుకొని షాక్‌కు గురయ్యారు. అమెరికాలో చదువుకుంటున్న చిన్న కుమారుడు విదేశీ చదువు కోసం చేసిన బ్యాంకు రుణాన్ని తీర్చడానికి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను సిద్ధం చేసి ఒక చోట భద్రపర్చగా, అవి చోరీకి గురైనట్లు వాపోయాడు.

**ఆలస్యంగా ఫిర్యాదు**

అయితే ఆదివారం సాయంత్రం విశాఖపట్నం నుంచి కంచిలి వచ్చిన వీరు తమ ఇంట్లో జరిగిన చోరీపై నిర్ఘాంతపోయారు. ఏం చేయాలో తెలియక పోలీసులకు కూడా ఫిర్యాదు చేయలేదు. చివరికి కంచిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్ఐ పి.పారినాయుడు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈ కేసును సోంపేట సీఐ బి.మంగరాజు పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు పరిశీలించారు. సంఘటన స్థలంలో గుర్తులు, ఆధారాలను సేకరించడానికి శ్రీకాకుళం నుంచి క్లూస్ టీమ్ వచ్చింది.

# ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి హరిబాబు

గార: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి కె.హరిబాబు అన్నారు. మంగళవారం అంపోలు వద్దనున్న జిల్లా జైలును ఆయన సందర్శించి న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. సమాజంలో మంచి గుర్తింపు వచ్చేలా ప్రవర్తన ఉండాలని సూచించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. న్యాయవాదిని నియమించుకోలేని ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలకు ఉచిత న్యాయవాదిని నియమించడం జరుగుతుందన్నారు. ముద్దాయిల అభ్యర్థనతో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం సదుపాయాలను, బ్యారెక్‌లు, లైబ్రరీ, వంట గదులను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి సూపరిటెండెంట్ జి.మధుబాబు, జైలర్ దివాకరనాయుడు, పి.అంజనీకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# 10 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్

నరసన్నపేట: ఒడిశా నుంచి బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న 10 కేజీల గంజాయిని నరసన్నపేట పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు బసంత మహాపాత్రో, సిద్దాంత స్త్రైన్‌లను అరెస్టు చేసినట్లు నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌తో కలిసి ఆయన తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఎప్పటిలాగే మడపాం టోల్ గేట్ వద్ద నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ తదితరులు మంగళవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో సోదాలు చేయగా వీరి వద్ద గంజాయి గుర్తించామన్నారు. వీరిద్దరూ ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంభ పోలీసుస్టేషన్ పరిధిలోని కొండాలి గ్రామం నుంచి అక్రమంగా గంజాయిని బెంగళూరు తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. దీంతో గంజాయిని సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. గంజాయి రవాణాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి అమ్మకాలు, రావాణాకు సంబంధించి సమాచారం తెలిస్తే తెలియజేయాలని కోరారు.

# యూనిఫారాలపై పూటకో మాట

శ్రీకాకుళం: జిల్లాలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డేకు విద్యార్థులు యూనిఫామ్ వేసుకుని రావాల్సిన అవసరం లేదని ఎస్ఎస్ఏ అధికారులు తమను సంప్రదించిన ప్రధానోపాధ్యాయులకు చెబుతున్నారు. జిల్లాలోని ఐదు మండలాలకు ఇప్పటికీ యూనిఫాం కిట్లు సరఫరా కాలేదు. మరికొన్ని మండలాలకు ఆలస్యంగా యూనిఫాంలు సరఫరా అయ్యాయి. వాటిని విద్యార్థులు ఇప్పటివరకు కుట్టించుకోలేకపోయారు .ఈ కారణంగా అలాంటి విద్యార్థులు యూనిఫారాలు వేసుకు వచ్చే పరిస్థితి ఉండదు. దీంతో యూనిఫారాలపై తప్పనిసరి అని ఒకసారి, అక్కర్లేదు అంటూ మరోసారి చెబుతున్నారు.

**గిరి ప్రదక్షిణ రోజున..**

దీనికి తోడు ఈనెల 10వ తేదీన సింహాచలం లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ జరగనుంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన పలువురు భక్తులు ఇందులో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఆ రోజున మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తే తక్కువ మంది హాజరవుతారని దీని వల్ల కొంతమేర ఉపశమనం కలుగుతుందని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. గిన్నిస్ బుక్ రికార్డు కోసం మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహణకు మాత్రం ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. తాజాగా ఓ ఉత్తర్వును విడుదల చేస్తూ పాఠశాల నిర్వహణ నిధుల నుంచి పది శాతం ఈ కార్యక్రమం కోసం వినియోగించుకోవచ్చని పేర్కొంది. పాఠశాల స్థాయిని బట్టి రూ.5000 నుంచి రూ.25 వేల వరకు నిర్వహణ నిధులు ఉంటాయి. ఇందులో 10 శాతం అంటే రూ.500 నుంచి రూ.2500 వరకు కార్యక్రమం కోసం వెచ్చించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వ విధానాలపై సర్వత్రా ఆక్షేపణలు వినిపిస్తున్నాయి. మొన్నటి వరకు యోగాను రికార్డు కోసం నిర్వహించగా ఇప్పుడు మరో రికార్డు కోసం పేరెంట్స్ డే ను నిర్వహిస్తుండడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

### ఆక్రమణలు తొలగించాలి

జలుమూరు: మండలంలోని చిన్నదూగాం పరిధిలోని సర్వే నంబర్ 59, 48లో ఉన్న కాకర్ల చెరువులో ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్.జీ.టీ) తుది తీర్పు వెల్లడించినట్లు గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, సుప్రీం కోర్టు న్యాయవాది డి.వి.రావు మంగళవారం తెలిపారు. సుమారు 22 ఎకరాల విస్తీరణం కలిగిన కాకర్ల చెరువు ఆక్రమణలకు గురైనట్లు గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ 2020లో ఎన్‌జీటీని ఆశ్రయించింది. దీనిపై పలుమార్లు వాదనలు విన్న ఎన్‌జీటీ జిల్లా కలెక్టర్‌కు పలు ఆదేశాలు జారీ చేసింది. ఆక్రమణలు తొలగించాలని, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, స్థానికంగా పర్యవేక్షణ కమిటీని నియమించాలని పేర్కొంది. రాష్ట్ర ముఖ్యకార్యదర్శి నుంచి ఆదేశాలను తీసుకొని, చెరువు సమీపంలోని కాలనీ వాసులకు వేరేచోట పునరావాసం కల్పించాలని ఎన్‌జీటీ ఆదేశించినట్లు డి.వి.రావు తెలిపారు.

### 'తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు వద్దు'

కాశీబుగ్గ: పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో కవిటి, కంచిలి మండలాల్లో వడ్డీ కులస్తులు బెంతు ఒరియాల పేరుతో చెలామణి అవుతూ అటు ప్రభుత్వాలను, ఇటు న్యాయస్థానాలను మోసం చేస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అన్నారు. పలాసలో బంకేశ్వరి కల్యాణ మండపంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. గిరిజన ఆచార సంప్రదాయాలకు సంబంధం లేని వడ్డి కులస్తులు బెంతు ఒరియాల పేరుతో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందడానికి దొడ్డిదారిన ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాల పరిశోధన సంస్థ వారు ఇచ్చిన అధ్యయన నివేదిక, ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన నివేదికలను పరిశీలించి కలెక్టర్, పలాస ఆర్డీఓలు గిరిజనేతరులకు ఎస్టీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన బెంతు ఒరియా కుల ధ్రువీకరణ పత్రాలన్నీ తక్షణమే రద్దు చేయాలని, లేదంటే ఆదివాసీలు ప్రతిఘటిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా సహాయక కార్యదర్శి వెంకటేష్, పాపారావు, సురపు నాయుడు, భాస్కర్ రావు, ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: మండలంలోని చిలకపాలేం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం జిల్లా ఆనందపురం నుంచి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వస్తున్న శ్రీనివాస్ దీక్షిత్ (52) అనే వ్యక్తి చిలకపాలేం, ఎచ్చెర్లకు మధ్యలో అదుపుతప్పి పక్కన ఉన్న ఫ్లై ఓవర్ గోడకు ఢీకొని మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఒక పరిశ్రమలో పనిచేస్తున్న శ్రీనివాస్ దీక్షిత్ 6 నెలల క్రితం బలగలో నివాసముంటున్న తన తమ్ముడు శ్రీధర్ దీక్షిత్ ఇంటికి వచ్చి ఉంటున్నట్లు తెలిపారు. ఈనెల 6వ తేదీన మరో తమ్ముడు శ్రీకాంత్ దీక్షిత్ ఇంటికి బైక్ వెళ్లి తిరిగి మంగళవారం మధ్యాహ్నం శ్రీకాకుళం వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈయన భార్య లక్నోలో ఉంటోంది. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింహగిరి ప్రదక్షిణకు వేళాయె..!

- బుధవారం వేకువజాము నుంచి ప్రదక్షిణ

శ్రీకాకుళం: సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న సింహగిరి ప్రదక్షిణకు సంబంధించి మార్గాలు, దర్శన సమయాలను ఆలయ అధికారులు ఖరారు చేశారు. బుధవారం వేకువజాము నుంచి గురువారం సాయంత్రం వరకు ఈ గిరి ప్రదక్షిణ జరగనుంది.

**పుష్పరథం తిరిగే మార్గం**

తొలి పావంచ, అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షి నగర్, జోడిగుడ్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుగా, ఎంవీపీ కాలనీ, డబుల్ రోడ్డు, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, ఎన్ఏడీ కొత్త రోడ్, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటుంది.

**భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం**

సింహగిరి తొలి పావంచ వద్ద ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైలు రోడ్డు, హనుమంతవాక, విశాలాక్షి నగర్, జోడు గొల్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుగా, ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, నరసింహ నగర్, కోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పదార, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీ నగర్, కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి తొలి పావంచ వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.

**దర్శన సమయాలు**

భక్తులకు దర్శన సమయాలను కూడా అధికారులు ప్రకటించారు. బుధవారం గిరి ప్రదక్షిణ చేసి సింహాచలం చేరుకునే భక్తులకు రాత్రి 10 గంటల వరకు దర్శనాలకు కల్పిస్తారు. గురువారం ఉదయం ఐదున్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు, తిరిగి సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. సింహగిరిపై గురువారం ఆలయ ప్రదక్షిణలు చేయాలనుకునే భక్తులకు తెల్లవారుజామున మూడు గంటల నుంచి అనుమతిస్తారు. భక్తుల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని కూడా ఆర్టీసీ అధికారులు కల్పించారు.

# హత్య కేసులో నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ అమీర్ అలీ

కొత్తూరు: మండలంలోని వసప గ్రామానికి చెందిన లుకలాపు మిన్నారావు హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో మంగళవారం హాజరు పరిచినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. నిందితుడు శంకరరావు నిర్వహిస్తున్న పాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు మృతుడు మిన్నారావు పకోడి, బజ్జీలు కొనుగోలు చేసేందుకు ప్రతిరోజూ వెళ్తుంటాడు. దీనిలో భాగంగా మృతుడు మిన్నారావు ఈనెల 5వ తేదీ రాత్రి శంకరావు పాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లి పకోడి కొనుగోలు చేసిన నేపథ్యంలో ఇద్దరు మధ్యం వివాదం జరిగింది. మిన్నారావు గతంలో బాకీ డబ్బులు ఇవ్వకపోవడంతో బాకీ విషయంలో ఇద్దరి మధ్య కొట్లాట జరిగింది. కొట్లాటలో మిన్నారావు తలపై సుత్తితో తల వెనుకభాగంలో కొట్టడంతో పాటు చాకుతో పీకను కోసి చంపినట్లు సీఐ ఎండీ అమీర్ అలీ పాల్గొన్నారు

# దారుణదారులు



ఎచ్చెర్ల మండలంలోని వెంకటాపురానికి వెళ్లే దారులు గజానికో గంతతో వాహనదారులకు పరీక్ష పెడుతున్నాయి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరడంతో పాటు బురదమయంగా మారుతుండడంతో నడవడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రహదారిపై వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



